

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### పెళ్ళయింది!

"**శారద వియ్యపురాళ్ళిద్దరం** ఒకే రంగు చీరలు కొనుక్కుందాం అంది. శృతికి తెల్లచీర గులాబీరంగు అంచున్నది కావాలిట. నేనేమో మెరూన్ కలర్‌ది కొన్నాను. ఇంకేం చేస్తా ఫస్ట్‌నైట్‌కి ఉంచుతా."

డ్రాయింగ్ రూంలోంచి ఖంగున వినపడే ఆ కంచుకంఠానికి మంచి నిద్రలో ఉన్న నేను ఉలిక్కిపడి లేచాను. రైలు మరీ తెల్లారుఝామున రావడంతో ఇంటికి వచ్చి, స్నానం భోజనం అవగానే మళ్ళీ నిద్రముంచుకువచ్చింది. ఈ కంచుగంట గారి మూలంగా మధ్యలో మెలుకువ వచ్చింది. ఇంకో అరగంట పడుకుంటే బావుండేది అనిపించింది.

"పదో తారీకున కంచి వెళ్తున్నాం. నువ్వూ వస్తావేంటి? " కంచుగంట అడుగుతోంది.

"లేదండి కుదరదు. మా చెల్లెలు వచ్చింది. అదీగాక ఇప్పుడు కంచి వచ్చి పట్టుచీరలు కొనుక్కునేంత అకేషన్స్ ఏవీ లేవు" అక్క సున్నితంగా నిరాకరించింది.

"మీ చెల్లెలొస్తే ఏమిటి? నువ్వు లేకుండా నాలుగురోజులు ఉండలేరా ఏమిటి? మా కారులో నేను ఒక్కదాన్నే. మావారు రానన్నారు. వంశీ ఆడవాళ్ళతో షాపింగ్ తలనొప్పి అంటాడు. నాకు తోడుగా ఉంటావు. రా" ఆవిడ ఆజ్ఞాపూర్వకంగా చెప్పింది.

"లేదండి. రాను ఏమీ అనుకోవద్దు. మీ ఆడపడుచు ఊళ్ళోనే ఉంటారుగా. ఆవిడని తీసుకువెళ్ళండి" అక్క గట్టిగా చెప్పింది.

"వద్దులే. ఒక్కదాన్నే వెళ్తాను. నాకేమైనా భయమా? మా సావిత్రి వస్తే నా షాపింగ్ చూసి కుళ్ళి చచ్చిపోతుంది. అసలే దాని కూతుర్ని చేసుకోవడంలేదని ఏడుపు."

ఆవిడ కంఠమే కాదు మనసుకూడా కంచే అనుకున్నాను. ఇక పడుకోలేక లేచి ముందుగదిలోకి వెళ్ళాను సన్నగా, పొట్టిగా తెల్లగా ఉన్న ఉన్న ఒకావిడ మడత నలగని కోటా చీర కట్టుకుని కూర్చుని ఉంది. పక్కనే సోఫాలో అక్క కూర్చుంది. టీపాయ్ మీద తాగేసిన కాఫీ కప్పులు ఉన్నాయి. పక్కనే ఖరీదైన హేండ్‌బేగ్.

"లేచావా? రా కాఫీ తాగుతావా? ఏమైనా తింటావా?" అక్క ఆదరంగా అడిగింది.

తర్వాత ఆవిడకి నన్ను పరిచయం చేసింది.

"మా చెల్లెలండీ. హైద్రాబాద్‌లో ఉంటారు ఏదో ఎగ్జామ్ ఉందిట. అక్కడ చదువుకోవడం కుదరడం లేదని నా దగ్గరకి వచ్చింది. పదిరోజులుంటుంది."

"పెళ్ళయిందా?" ఆవిడ నన్ను ఎగాదిగా చూసి అడిగింది.

"ఆఁ అయింది. దానికి గొలుసులు, గాజులు, అసలు బంగారం అంటేనే ఇష్టం ఉండదు. అందుకని వేసుకోదు" అక్క నావైపు కోపంగా చూస్తూ చెప్పింది.

"పెళ్ళయ్యాక ఇంకా ఎగ్జామ్స్ ఏంటి? ఓ! పాపం 'చాలామందివి రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు. నీలాగా హాయిగా కాలు మీద కాలు వేసుకుని మహారాణిలాగా జీవించే అవకాశం ఎంతమందికి ఉంటుంది' అంటారు మావారు" ఆవిడ సానుభూతిగా చెప్పింది.

ఆవిడ కంఠానికి, ఆకారానికి అస్సలు పోలికలేదు.

"మా చెల్లెలు డాక్టరండీ. మా మరిది కూడా డాక్టరే. మా చెల్లి పి.జి చేయడానికి ఎంట్రన్స్ ఎగ్జామ్ కోసం చదువుతోంది. వాళ్ళది కింద క్లినిక్, పైన ఇల్లు. ఎంతవద్దనుకున్నా హాస్పిటల్ బాధ్యతలు ఉంటాయిగా? అందుకని ఇక్కడికి వచ్చింది." అక్క వివరించింది.

"ఓ!" ఆవిడ నావంక కొంత సానుకూలంగా చూసింది. ఇంతలో ఆవిడ ఫోన్ మోగింది.

"వస్తున్నా. వస్తున్నా" అని చెప్పి ఆవిడ లేచింది.

"ఆయన ఫోన్ చేసారు హేమా. ఖాళీగా ఉన్నారుట. ఊళ్ళో కార్డ్స్ ఇచ్చి వద్దాం అన్నారు. వెళ్ళొస్తా. ఐతే నువ్వు కంచికి రానంటావ్?" అడిగింది.

"సారీ అండి రాను."

"సరేలే" ఆవిడ తన ఖరీదైన హేండ్‌బేగ్‌ని అందుకుని నావైపు నవ్వుతూ చూసి బయటకి నడిచింది. అక్క ఆవిడని అనుసరించింది. రెండు నిమిషాల తర్వాత లోపలికి వచ్చిన అక్కని అడిగాను.

"ఎవరక్కా ఈ కొంగర జగ్గయ్య? ఆకారానికి, గొంతుకి సంబంధంలేదే"

"పాపం మనిషి మంచిదే. కొద్దిగా గొప్పలు ఎక్కువ అంతే. మన పక్కింటావిడ."

"ఏ ఇల్లు? ఆ వైట్ హౌసా?"

"అవును. లోపల ఇంకా చాలా బావుంటుంది. స్వర్ణగారికి టేస్ట్ ఉంది" అక్క చెప్పింది.

"ఆవిడ పేరు స్వర్ణా? భేష్. ఆవిడ హోదాకి తగ్గ బంగారంలాంటి పేరు. పక్క గేటేగా. మరి హేండ్ బేగ్ ఎందుకు?" అనుమానంగా అడిగాను.

"ఏమోనే, ఆవిడకి అలవాటు అంతే. కాఫీ ఇస్తారా" అక్క వంటింట్లోకి దారి తీసింది.

"ఒక డౌట్. నువ్వావిడని మీరు అంటున్నావు. బంగారంగారు నిన్ను నువ్వు అంటుంది. ఈ వర్గ విభేదాలు ఏమిటి క్రామేడ్?" అడిగాను.

"ఆవిడ అంతే. అందర్నీ ఏకవచనంలోనే మాట్లాడుతుంది. నా సంస్కారం నాది" మా అక్క సంభాషణని తుంచేసింది.

రెండురోజులకోసారైనా ఆవిడ మా ఇంటికి రావడం అక్కతో ఆ రెండురోజుల విశేషాలు చెప్పడం, ఓ అరగంట ఉండి వెళ్ళడం గమనించాక నాకు ఒకటి అర్థమైంది. ఆవిడకి శ్రోత కావాలి. ఎదుటివాళ్ళు మాట్లాడాలని అసలు అనుకోదు. తన గొప్పలు, తన కుటుంబ విషయాలు తప్ప ఎదుటివాళ్ళ గురించి మాట్లాడదు. గాసిప్స్ చెప్పదు.

వాళ్ళ ఏకైక కొడుకు వంశీ పెళ్ళి ఇంకో పదిహేను రోజుల్లో ఉంది. లవ్‌మేరేజ్. అమ్మాయి పేరు శృతి. పెళ్ళి హైదరాబాద్‌లో. ఆవిడ కొడుకు పెళ్ళిమీద చాలా ఆశలు పెట్టుకుంది. లవ్‌మేరేజ్ అనేసరికి డీలా పడిపోయింది. కానీ శృతివాళ్ళు కూడా వీళ్ళంత కాకపోయినా బాగా డబ్బున్నవాళ్ళే అని తెలిసాక ఆనందపడింది. ఆ పెళ్ళి ముచ్చట్లు, షాపింగ్ విశేషాలు చెప్పడానికి తరచూ వస్తూనే వుంది.

ఓ రోజు ఆవిడ మా అక్కకి ఫోన్ చేసి వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించింది. నన్నుకూడా తీసుకురమ్మని చెప్పింది. నేనూ వాళ్ళిల్లు చూడాలనే కుతూహలంతో వెళ్ళాను. నిజంగా చాలా బావుంది. కళాత్మకంగా ఒక థీమ్ ప్రకారం ఇల్లంతా అలంకరించారు. ప్రతి వస్తువులోనూ ఒక సొగసు, వైవిధ్యం ఉన్నాయి. ఆవిడకి అందాన్ని ఒడిసి పట్టుకునే నేర్పు ఉంది అనుకున్నాను.

సోఫాలో బోలెడు అట్టపెట్టెలు. మమ్మల్ని మరో సోఫాలో కూర్చోపెట్టి ఒక్కోదాని మూత తీసి చూపించసాగింది.

"కంచిలో షాపింగ్ చేసాకదా. మీకు చూపిద్దామని. ఇదిగో ఈ చీర నాకోసం. శారద కూడా ఇలాంటి రంగుదే కొనుక్కుంది. పెళ్ళిలో మనిద్దరం ఒకే రంగు చీరలు కట్టుకుందాం వదినా అంది. నాకు పచ్చరంగు ఇష్టం అన్నాను. తనూ అదే కొనుక్కుంది" చెప్పింది.

శారద అంటే పెళ్ళికూతురు శృతి వాళ్ళమ్మ అని అప్పటికే అర్థమైన నేను లేబుల్ చూసాను. 58,000/-

"అమ్మో? ఏభై ఎనిమిదివేలా?" నివ్వెరపోయాను.

ఆవిడ సంతోషంగా నవ్వింది.

"మరి నా ముద్దులకొడుకు పెళ్ళిలో నేను మెరిసిపోవద్దు" మురిపెంగా చెప్పింది. ఆ తర్వాత మిగిలిన చీరలు చూపించింది. అన్నీ బావున్నాయి. ఖరీదు కూడా సగటున పదిహేనువేలు. పనమ్మాయిని పిలిచి వాటిని గెస్ట్‌రూంలో పెట్టమని సెల్‌ఫోన్ తీసింది.

మా ఇద్దరి మధ్యలో కూర్చుని అందులో కొన్ని ఫోటోలు చూపించింది.

"ఈ చీరలన్నీ శృతికి కొన్నా. జాకెట్లు, ఫాల్స్ కుట్టించుకోడానికి శృతి హైదరాబాద్ తీసుకెళ్ళింది. ఇది పెళ్ళికి, ఇది తలంబ్రాలు.." ఈ విధంగా ఒక అరడజను సందర్భాలు చెప్పింది.

నాకు బాగా నచ్చిన చీర తొంభై ఎనిమిది వేలట.

తర్వాత మాకు కాఫీ, ఫలహారాలు తెప్పించింది. మేం కాఫీ తాగుతుండగా బెడ్రూంలోకి వెళ్ళి కొన్ని నగల పెట్టెలు తెచ్చింది.

ఒక్కోటి మూత తీసి చూపిస్తూ చెప్పింది.

"మద్రాస్‌లో నగల షాపింగ్ కూడా చేసాం. మరి మేచింగ్ నగలు ఉండాలిగా" ఏ సందర్భాల్లో ఏ ఏ నగలు ధరిస్తుందో చెప్పింది. పెళ్ళికూతురుకి పెట్టేవికూడా చూపించింది. వాళ్ళు ధనవంతులని తెలుసుకానీ ఇంత ధనవంతులనుకోలేదు నేను.

"నయం! కంచిలో ఐదువేలలో ఓ పట్టుచీర తెమ్మని అడుగుదాం అనుకున్నా" అక్క ఇంటికి వస్తూ గొణిగింది.

ఆ తర్వాత స్వర్ణగారు పెళ్ళి హడావిడిలో పడి మా ఇంటికి రావడం తగ్గించారు కానీ అడపాదడపా ఓ ఐదునిమిషాలసేపు ఉండి చెప్పిన కబుర్ల సారాంశం.

హైదరాబాద్‌లో పెళ్ళికి వీళ్ళ తరఫున మూడువందల మంది వెళ్తారు. అందరికీ రిటర్న్ గిఫ్ట్‌లు అమ్మాయి తరపు వాళ్ళే ఇవ్వాలి. అదీ వెండి వస్తువులే ఇవ్వాలి. భోజనంలో కనీసం నూట ఏభై ఐటమ్స్ ఉండాలి. ఇండియన్‌తోపాటు చైనీస్, ఇటాలియన్ లైవ్ స్టాల్స్ ఉండాలి. దగ్గరి బంధువుల కోసం ఫైవ్ స్టార్స్ హోటల్స్‌లో ఇరవై గదులు బుక్ చేయాలి. పెళ్ళికొడుకుకి సూట్ రూం. మిగిలిన వాళ్ళకి 3, 2 స్టార్ హోటల్స్ ఓకే. వీళ్ళందరి రాకపోకల కోసం కనీసం ఏభై కార్లు ఇరవైనాలుగ్గంటలూ అందుబాటులో వుండాలి. ఆడవాళ్ళందరికీ కంచిపట్టుచీరలు పెట్టాలి.

ఈ జాబితా ఇంకా చాలావుంది. కొన్ని గుర్తులేవు కూడా. అక్క ఆశ్చర్యపోయి గుండెలమీద చెయ్యి వేసుకుని అడిగింది. "అమ్మో! వాళ్ళు ఇవన్నీ చేస్తామన్నారాండీ?"

"మరి ? లవ్ మేరేజ్ కదా. కట్నాలూ కానుకలేం లేవుగా. మర్యాదలైనా చేయక్కర్లా? మేం ఇక్కడ రిసెప్షన్ ఇంకా వైభవంగా చేస్తాం. మీరూ వస్తారుగా. చూస్తూండండి. శ్రీనివాసుడు పద్మావతి పెళ్ళి కూడా అంతవైభవంగా జరిగి ఉండదు." ఆవిడ ఆత్మవిశ్వాసంగా చెప్పింది.

ఓ రోజు భార్యాభర్తలిద్దరూ వచ్చి శుభలేఖలు ఇచ్చారు. అక్కవాళ్ళకి రిసెప్షన్ కార్డ్, నాకు పెళ్ళి కార్డ్.

"నువ్వు రెండురోజుల్లో వెళ్ళిపోతున్నావని మీ అక్క చెప్పింది పెళ్ళికి తప్పకుండా రా. మీ ఆయన్ని కూడా తీసుకురా" ఆప్యాయంగా చెప్పింది.

ఆ కార్డ్స్ కూడా చాలా కళాత్మకంగా ఉన్నాయి.

"ఎందుకింత వేస్ట్ చేస్తారు? ఒక్కో కార్డ్ కనీసం వెయ్యిరూపాయలు ఉంటుంది. మర్నాటికి పనికిరాదు. ఎవరు తిన్నట్టు?" బావగారు గొణిగారు.

అక్క మరీ మరీ చెప్పడంతో పెళ్ళికి వెళ్దామని నిర్ణయించుకున్నాను. నాకు చాలా కుతూహలంగా ఉంది. మధ్య తరగతి వాళ్ళం కాబట్టి ఇంత రిచ్ పెళ్ళికి వెళ్ళడం ఇదే మొదటిసారి. నా అభిరుచికి వ్యతిరేకంగా గ్రాండ్‌గా తయారయ్యాను. నా పెళ్ళి పట్టుచీర, నాకున్న నగలన్నీ వేసుకున్నాను. బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి మేకప్ చేయించుకున్నాను.

"ఈ ఒక్కరోజు నా కోసం సూట్ వేసుకోండి" మా వార్ని అభ్యర్థించాను.

పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు అందంగా ఉన్నారు. ఇంకా అందంగా తయారయ్యారు. స్వర్ణగారు నన్ను చాలా ఆప్యాయంగా ఆహ్వానించారు. భోజనాల దగ్గర చివరిదాకా వెళ్ళి చూసే ఓపికలేక దగ్గర్లో ఉన్న కౌంటర్స్‌లో ఏముంటే అవి తిన్నాం.

'వెళ్ళొస్తాం' అని చెప్పగానే ఆవిడ, ఆడపెళ్ళివాళ్ళు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌ని తన చేతులతో ఇచ్చింది. కమలంలో కూర్చున్న లక్ష్మీదేవి వెండి విగ్రహం.

"ఆ పెళ్ళేంటి? ఆ ఖర్చేమిటి? నాకు ఊపిరాడలేదు. ఎప్పుడెప్పుడు వెళ్దామా అనిపించింది" మావారు దారిలో విసుక్కున్నారు.

"నాకు బానే వుంది. బోల్డుమంది సెలబ్రిటీలని చూసాను" ఆనందంగా చెప్పాను.

వైజాగ్‌లో రిసెప్షన్ చాలా బాగా జరిగిందని మా అక్క ఫోన్ చేసి చెప్పింది. ఇద్దరం గంటసేపు వంశీ పెళ్ళి ముచ్చట్లు చెప్పుకున్నాం.

నాకు చండీఘర్‌లో యం.ఎస్‌లో సీట్ వచ్చింది. "రెండేళ్ళపాటు బిజీగా ఉంటావు. వైజాగ్ రావే. ఓ వారం ఉండిపో" అక్క పిలిచింది. నాకూ దిగులుగా అనిపించి నాలుగురోజులైనా ఉందామని వెళ్ళాను.

"అక్కా మీ బంగారంగారు ఎలా ఉన్నారు? కోడలు కలివిడి మనిషేనా?" అడిగాను.

"ఏమో నాకేం తెలుసు? వాళ్ళు బెంగుళూరులో ఉంటారు. వంశీకి ఏదో కంపెనీ ఉంది" అక్క చెప్పింది.

ఆ మధ్యాహ్నం స్వర్ణగారు వచ్చారు. ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్‌లో సీట్ సంపాదించినందుకు నన్ను అభినందించారు.

"మా శృతి కూడా ఎంత తెలివైన పిల్లో. బిజినెస్‌లో ఎంత చురుకో.." చాలాసేపు కోడల్ని పొగిడింది.

"ఇదివరకు తను, తన ఐశ్వర్యం గురించి మాట్లాడేది. ఇప్పుడు కొత్తగా కోడలి ముచ్చట్లు. నా పనులన్నీ ఆగిపోయాయి. ఇదివరకు మధ్యాహ్నాలు ఎన్ని పనులు చేసుకునేదాన్నో. 'కర్టెన్లు మార్చి ఎన్ని రోజులైంద'ని మొన్న మీ బావగారు కూడా అడిగారు" అక్క నిస్సహాయంగా చెప్పింది.

"కొత్తగా డయాబెటిస్ వచ్చిన వాళ్ళనించేకాదు. కొత్తగా పిల్లలకి పెళ్ళయిన వాళ్ళనించి కూడా దూరంగా ఉండాలి. ఆ ముచ్చట్లకి ఫుల్ స్టాప్ ఉండదు" నవ్వాను.

అక్కడున్న నాలుగురోజుల్లో నేను ఒకేసారి చూసిన శృతి గురించి నాకూ చాలా తెలిసింది. కాకపోతే ఏవి నిజాలో, ఏవి అభూతకల్పనలో మాత్రం తెలియలేదు.

నేను చండీఘర్ వెళ్ళిన మూడు నెలల తర్వాత అక్కనించి ఓ రోజు మెసేజ్ వచ్చింది. 'టైం ఉన్నప్పుడు కాల్ చెయ్యి'

ఎందుకా అని కొద్దిసేపు ఆలోచించి నావల్ల కాక వెంటనే ఫోన్ చేసాను. మొదటి రింగ్‌కే ఆన్సర్ చేసిన అక్క ఉద్విగ్నంగా చెప్పింది.

"స్వర్ణగారి కొడుకు విడాకులు తీసుకుంటున్నాడట."

"ఆ! ఏమిటి?" నేను నిర్ఘాంతపోయాను.

"అవును. స్వర్ణగారి పనిమనిషి చెప్పింది. వాళ్ళిద్దరూ ఊర్లో లేరు. బెంగుళూరు వెళ్ళారు. నచ్చచెప్పడానికనుకుంటా."

"వీళ్ళమూలంగానా?"

"అబ్బే! లేదు. ఆవిడ చాలా మంచిమనిషి. అసలు వాళ్ళు ఇక్కడ లేరు కదా?"

"అయ్యో! సరే అక్కా. ఇంకేదైనా తెలిస్తే వెంటనే నాకు చెప్పు. బై" ఫోన్ పెట్టేసాను.

నా మనసు వికలమైంది. పెళ్ళయిన ఆరునెలల్లోనే విడాకులు ఏమిటి? అంతకు ముందు మూడేళ్ళుగా ప్రేమించుకున్నారు. పెద్దవాళ్ళని ఒప్పించారు. ఆర్నెల్లలో ఆ ప్రేమంతా ఏమైంది? పెద్దవాళ్ళు వెళ్ళారుగా రాజీ కుదురుస్తారులే అనుకున్నాను.

నెల తర్వాత మళ్ళీ అక్కనించి ఫోన్.

"వీళ్ళు ఎంత చెప్పినా వాళ్ళు వినలేదుట. మేం ఫ్రెండ్లీగా విడిపోతాం. మాకు బోర్ కొట్టేసింది అంటారట. శృతి వాళ్ళమ్మా నాన్నా 'చస్తాం' అని బెదిరించినా ఆ పిల్ల వినలేదుట. నా లైఫ్, నా ఇష్టం అందిట. ఇందాక స్వర్ణగారు వచ్చి పాపం చాలా బాధపడ్డారు. వంశీ మీ టార్చర్ ఏమిటి నాకు అని ఏదో దేశానికి వెళ్ళిపోయాడట. వీళ్ళు రాలేరు అని. ఎక్కడికో కూడా చెప్పలేదట.."

పెళ్ళి గురించి స్వర్ణగారు కన్న కలలు, పెట్టిన ఖర్చు, వాళ్ళ ఉత్సాహం, మండపంలో వధూవరుల్లోని ఆనందం, ప్రపంచాన్ని జయించామన్నంత విజయగర్వం గుర్తొచ్చాయి. వెయ్యిరూపాయల శుభలేఖ మర్నాడు చెత్తబుట్టలోకి వెళ్ళినట్లు, ఏభైకోట్ల పెళ్ళి చివరికి కోర్టుకి చేరింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments